# చేయూత పథకాల పేరుతో మిర్చి రైతులను మరింతగా దగాచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు





రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ప్రచురణ

# మిరప కోరులో

- పాపినేని శివశంకర్

ఎన్నిసార్లు విత్తనమై మొలకెత్తానో
అన్నిసార్లు మరణించాను
ఎన్నిసార్లు బస్తాలై, బళ్ళై, ట్రాక్టర్లై రేయింబగళ్లు
కొనుగోలు కేంద్రాలముందు పడిగాపులయ్యానో
అన్నిసార్లూ దారుణంగా దగాపడ్డాను
కోత లేకుండా చేలో రాలిపోయే మిరపకాయల్ని చూడు
మండే ఎండల్లో మంట రేపే కాయల్ని మించి
మండిపోయే గుండెల్ని గుడ్లు మిటకరించి చూడు

ఏటికేడాదీ ఏటికి ఎదురీతల గురించీ
జడ్డిగంలో మిడతపోటు గురించీ - నిన్నడగటంలేదు
కాళ్లల్లో దిగబడ్డ మోళ్లు పీకలేని
నీ యాప్‌లు, సబ్సిడీలు సవాలక్ష పథకాలెందుకని
మీటలు నొక్కే వేళ్లకి మొక్కని సాకే చేతుల వైనమెట్లా తెలుస్తుందని
ఎద్దుముడ్డి పొడుచుకునే వాడికి చౌక విమాన యానాలెందుకని - ప్రశ్నించటంలేదు
అకాలంలో ఆకాశాల అకాండతాండవం ఎట్లాగూ ఆపలేవు
పల్లెపల్లెనా పారించే మద్యపుటేర్లతో
బెట్టగొట్టిన చేలని ఎట్లాగూ తడపలేవు
ఆకుపచ్చని నేలంతా సిమెంట్ రంగులోకి
మార్చిడయ్యే మతలబు ఎట్లాగూ విప్పలేవు
ఇసుక మేటల చాటున డబ్బు మేటల్ని ఎట్లాగూ నివారించలేవు
నేలమాళిగల్లో నల్లనాగుల  లెక్కలెట్లాగూ చెప్పలేవు
బురదమట్టల్ని తప్ప తిమింగలాల్ని ఎట్లాగూ వేటాడలేవు
కనీసం మీ అందాల సభాభవనాల ముందు
ఎన్ని మిరపటిక్కీలు తగలబెట్టాలో నిర్ణయించు
ఎంత కోరులో నువ్వు కంట్లో జల్లిన కారం ఘాటులో
ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి కావాలో చెప్పు
రక్తమాంసాలు ధారపోసే నేలబిడ్డల నెత్తిమీద
రాబందులెందుకు వాలాలో వివరించు
ఈ నాగలి మొనదేలిన కర్రుతో ఇంకెన్నిసార్లు తన గుండెల్లో పొడుచుకోవాలో
పగ్గాలు పట్టే చేతులు ఎన్నెన్ని ఉరితాళ్లు పేనుకోవాలో చెప్పు
ఇంకెన్ని తరాలకి ఈ గొడ్డుమోతు విత్తనాలకి, ఈ పొలాల
        ఎడారులకి, ఈ చావు శోకాలకి చివరి బిందువో చెప్పు
ఈ కండెలు గట్టిన, కాయలు గాసిన కాళ్లూ చేతులే
        పాదాలుగా నిలిచిన సింహాసన నాలుగు విరూపాల్ని
ఎప్పుడు తల్లకిందులు చేయాలో అది కూడా నువ్వే చెప్పు

(రెండు రాష్ట్రాల మిర్చి రైతుల ఆక్రోశంతో కలిసి) ❖

# ముందుమాట

వ్యవసాయం రైతులకు పెనుభారంగా మారుతోంది. రాష్ట్రంలో రైతాంగం పండిస్తున్న అన్ని పంటల పరిస్థితీ అలానే వుంది. సంస్థాగత రుణాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేకుండా అతివృష్టి – అనావృష్టి, చీడ – పీడలను ఎదుర్కొంటూ, వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు (విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చు, నీటి ఖర్చు – కౌలుదార్లకు అదనంగా కౌలు ఖర్చు) పెరిగిపోయి రైతు వ్యవసాయం చేస్తున్నాడు. చేతికొచ్చిన పంటకైనా న్యాయమైన మద్దతు ధర లేకపోగా మార్కెట్‌శక్తుల దయాదాక్షిణ్యాలకు రైతులను పాలకులు వదిలివేయటం వారి కష్టాలను మరింత అధికం చేస్తోంది. రైతు పీకలలోతు రుణభారంలో కూరుకుపోతున్నాడు. అనేకమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

మార్కెట్‌శక్తులకు, బడా వ్యాపారులకు అధిక లాభాలు చేకూర్చిపెడుతూ, ఒకవైపు రైతులను, కూలీలను, మరోవైపు వినియోగదారులను దోపిడీకి గురిచేస్తున్న విధానాలను పాలకులు అనుసరిస్తూ రావటం యాదృచ్ఛికం కాదు. వ్యవసాయాన్ని గిట్టుబాటు గాకుండా చేసి, రైతును దివాళా తీయించి, వ్యవసాయాన్ని రైతు వదిలివెళ్ళేలా చేయటం దీనివెనుక దాగున్న పాలకుల కుట్ర. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను వేగంగా అమలుచేస్తూ ముందుకు సాగుతున్న కేంద్ర, రాష్ట్ర పాలకులు ఆర్థిక మీటలతో వ్యవసాయాన్నుండి రైతులను గెంటివేసే విధానాలను తీవ్రతరం చేస్తున్నారు. కంపెనీ వ్యవసాయాన్ని, కార్పొరేటు / కాంట్రాక్టు వ్యవసాయాన్ని ముందుకు తెచ్చే విధానాలను కుటిలపూరితంగా అమలు చేస్తున్నారు. ఈ విధానాల అమలులో భాగంగానే జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోవాలి.

ఆసియాలోనే ప్రసిద్ధిగాంచిన మిర్చియార్డు గుంటూరులో వుంది. జాతీయ సుగంధ ద్రవ్యాల బోర్డు గుంటూరులో వుంది. జిల్లాలో మిర్చి పంటను అధికంగా పండిస్తారు. రసాయన ఎరువుల వినియోగంలో గుంటూరుజిల్లా ప్రథమస్థానంలో వుంది. ఈ జిల్లాలో మిర్చి రైతాంగం వ్యవసాయ సీజన్‌లో ఎదుర్కొంటున్న దురవస్థలెన్నో. రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో మిర్చి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి, వివిధ కరపత్రాల ద్వారా మిర్చి రైతాంగాన్ని చైతన్యపరిచే కృషిచేశారు. 'ఆత్మహత్యలు పరిష్కారం కాదు, ఐక్య పోరాటం ద్వారానే సమస్యలను పరిష్కరించుకోగలమ'ని, కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల దగాకోరు విధానాల భ్రమలకు లోనుకావద్దని పిలుపునిచ్చారు. ఆ కృషిలో భాగంగా సంస్థ ఈ బుక్‌లెట్‌ను వెలువరిస్తోంది. దీనిని విస్తృతంగా రైతాంగం మధ్యకు తీసుకెళ్ళి, వారిని సంఘటిత ఆందోళనలకు సన్నద్ధం చేయవలసిందిగా పిలుపునిస్తున్నది.

**విజయవాడ** **రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)**

**25-5-17**

# చేయూత పథకాల పేరుతో మిర్చి రైతులను మరింతగా దగాచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

"ఈనగాసి నక్కల పాలైంది" అనేది తెలుగునాట ఒక సామెత. చెమటోడ్చి పంటలు పండించిన రైతుల పరిస్థితి పై సామెత మాదిరి తయారయింది. ఆరుగాలం ఇంటిల్లిపాది రెక్కలు ముక్కలు చేసుకుని అష్టకష్టాలు పడి పంటలు పండిస్తే రైతుల కష్టార్జితాన్ని దళారీ దోపిడి మార్కెట్‌శక్తులు రాబందుల మాదిరి పీక్కుతింటున్నాయి. అయినా రైతుల కన్నీటి వ్యథలు పాలకులకు, ప్రభుత్వాలకు పట్టడంలేదు. భూమినే నమ్ముకున్న రైతు వెన్ను విరిచే విధానాలను పాలకులు అమలు జరుపుతున్నారు. ఫలితంగా రైతులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి బైటపడేదారిలేక పురుగుల మందు తాగే దయనీయ పరిస్థితికి నెట్టబడ్డారు. ఈ సంవత్సరం ఏప్రిల్-మే నెలల మధ్య నెలరోజుల వ్యవధిలో గుంటూరు జిల్లాలో 20 మంది వరకు మిర్చి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇరు తెలుగు రాష్ట్రాల్లోనూ మిర్చి రైతాంగ పరిస్థితి ఇలాగే వుంది. దిక్కుతోచని స్థితిలో బలవన్మరణాలకు పాల్పడుతున్న మిర్చి రైతుల సంఖ్య ఈ రెండు ప్రాంతాలలోనూ అధికంగా వుంది.

**కష్టాల సాగులో మిర్చి రైతులు :**

ఈ సంవత్సరం మిర్చి రైతు పడినన్ని అగచాట్లు అన్నీ ఇన్నీ కాదు. విత్తనాలు మొదలుకొని పంట అమ్ముకునే దాకా మిర్చి రైతులు అడుగడుగున నిలువు దోపిడీకి గురయ్యారు. "పాడు మిరపకాయలు పండించకపోయినా బాగుండేదని" వ్యథ చెందుతున్నారు. పాలకుల, ప్రభుత్వాల, దోపిడీ మార్కెట్‌శక్తుల ముప్పేట దాడికి కుప్పకూలుతున్నారు. ముందు దగా, వెనుక దగా-కుడి, ఎడమల దగా దగాతో కోలుకోలేకపోతున్నారు.

మిర్చిని-పొలంలో చెట్టునే వుంచలేడు, కోసి కల్లంలో వుంచలేడు, తొక్కి గోతాల్లో వుంచలేడు, మెట్టు కట్టి ఇంట్లో వుంచలేడు. శీతల గిడ్డంగుల్లో చోటులేదు. అయినకాడికైనా తెగనమ్ముకుందామన్నా కొనే నాథుడు లేడు. పంట పండించడానికి ఎన్ని తిప్పలు పడ్డాడో అంతకన్నా ఎక్కువ తిప్పలు పడ్డా పంట అమ్ముకోలేని పరిస్థితిని రైతుకు కల్పించారు.

దోపిడీ పాలక ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాల ఫలితంగా ఈ సంవత్సరం పంటలు పండించిన రైతులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. మిర్చితో పాటు పసుపు, మినుము, కంది, పెసలు తదితర ఏ ఒక్క పంటకీ ప్రభుత్వం న్యాయమైన ధర కల్పించలేదు. రైతులను మార్కెట్ శక్తుల యిష్టా రాజ్యానికి వదిలివేశారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం వ్యవసాయ పంటల ధరలు సగానికి పైగా పతనమయ్యాయి.

**మిర్చి రైతుల దయనీయ పరిస్థితి :**

ఆరుగాలం ఎంతో శ్రమించి పండించిన పంటకు కనీసం కోత కూలీ కూడా రాకపోవడంతో మిర్చి రైతులు తమ పంట భూములను మిరపకాయలతో సహా దున్నేస్తున్నారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి రాత్రింబవళ్ళు కష్టపడి మంచి ధరకు మిరపకాయలు అమ్ముకుందామనుకున్న రైతుకు కష్టనష్టాల సాగు మిగిలింది.

రైతు పంటను దున్నడమంటే కన్న బిడ్డను స్వయంగా చంపుకున్నట్లే. ఎంత బాధను, వ్యధను భరించి రైతు పంటను దున్నతున్నాడో మాటలకు అందదు. పంటతో సహా వదలివేయడం, దున్నేయడం వ్యవసాయ చరిత్రలో ఇంతకు ముందు ఎన్నడూ జరగని విచిత్రం. ఇంత దారుణ పరిస్థితులు రాష్ట్రంలో నెలకొనగా వ్యవసాయరంగం రెండంకెల వృద్ధితో పరుగులు పెడుతుందని ప్రతిరోజు ముఖ్యమంత్రి వారి అనుచర గణం ఊదర గొడుతున్నారు.

## మిర్చి ధరల పతనానికి పంట దిగుబడి అధికంగావడమే కారణమా?

మిర్చి ధరల పతనానికి ఈ సంవత్సరం పంట దిగుబడి అధికంగావడమే కారణమని పాలకులు, ప్రభుత్వాలు తప్పుడు ప్రచారం చేయడం ధరల పతనానికి అసలు కారణాలను మరుగున పర్చడమే. పాలకులు ఉద్దేశ్యపూరకంగానే ఈ అబద్ధపు ప్రచారాన్ని లంకించుకున్నారు. విస్తీర్ణం పెరిగిందని, పంట దిగుబడి కూడా గణనీయంగా వుందని, ఇతర రాష్ట్రాలలో కూడా మిర్చి దిగుబడి పెరిగిందని ఒక పథకం ప్రకారం ఈ సంవత్సరం కొనుగోలు ప్రారంభం నుండే దళారులు, పాలక ప్రభుత్వాలు ప్రచారం చేస్తూ వచ్చారు. అయితే ఈ ప్రచారంలో వాస్తవం లేదు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అబద్ధపు ప్రచారాలు.

గత సంవత్సరం రాష్ట్రంలో 3.9 లక్షల ఎకరాలలో మిర్చి పంట వేయగా ఈ సంవత్సరం 4.6 లక్షల ఎకరాలలో మిర్చి పంట సాగుచేశారు. అయితే విస్తీర్ణం పెరిగిందిగాని గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం దిగుబడి తగ్గింది. ఈ సంవత్సరం వర్షాలు సరిగాలేని కారణంగాను, ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగాను, కల్తీ మరియు నకిలీ విత్తనాలు, నకిలీ మిరపనారు కారణంగాను, బొబ్బర, ఏరుకుళ్ళుడు, ఎండాకు తెగులు వంటి తెగుళ్ళ కారణంగాను, కాలువల ద్వారా సాగు నీరు ప్రభుత్వం సక్రమంగా అందివ్వని కారణంగాను దిగుబడులు బాగా తగ్గాయి.

పల్నాడులో ఎండాకు తెగులు కారణంగా తుమ్మకోటలో 150 ఎకరాలు, మల్లవరంలో 50 ఎకరాలు, రెంటచింతలలో 50 ఎకరాలు, దాచేపల్లిలో 70 ఎకరాలు, సారంగపల్లి, అగ్రహారం, కొత్తూరులలో 125 ఎకరాలు మిరపచేలు ఎండిపోయాయి. ఇదే విధంగా గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాలలో ఎండాకు తెగులు వల్ల వందలాది ఎకరాల్లో ఎదిగిన మిరప తోటలను పీకి వేశారు. కల్తీ విత్తనాలు, నకిలీ మిరప నారు వల్ల షుమారు 5 వేల ఎకరాలలో తోటలు పీకి వేశారు.ప్రకాశం జిల్లాలో వెయ్యి ఎకరాలు, కృష్ణా జిల్లా గంపల గూడెం ఏరియాలో వెయ్యి ఎకరాలు, కర్నూలు జిల్లాలోను కల్తీ, నకిలీల వల్ల పైరు పీకి వేశారు. అంతేకాకుండా ధరలు పతనంకావడంతో కోత కూలీ కూడా రాదనే దానితో వందల ఎకరాలలో మూడో కోత కాయలు వదిలేసి దున్నేశారు. గిట్టుబాటు కాకపోవడంతో మొదటి కోత కోయని చేలు కూడా కొంతమంది రైతులు వదిలి వేశారు.

నాగార్జున సాగర్ డ్యాంలో 2004 సం॥లో 520 అడుగుల నీటిమట్టం వున్నప్పటికి రెండు పంటలకు సాగునీరు విడుదల చేశారు. కాని ఈ సంవత్సరం నీటి మట్టం 540 అడుగులు వున్నప్పటికి ప్రభుత్వం సాగు నీరు విడుదల చేయలేదు. రైతులు పలుమార్లు ఆందోళనలు నిర్వహించగా రెండు దఫాలుగా ఆరుతళ్ళు వదిలారు. దీనితో నీటి ఎద్దడి

ఏర్పడింది. ఒకపక్క వర్షాలు లేక, మరో ప్రక్క కాలువలు రాక పంటలు ఎండు ముఖం పట్టాయి. బోర్ల ద్వారా, ట్యాంకర్ల ద్వారా వేలాది రూపాయలు నీటి తడులకు ఖర్చు పెట్టలేక అరకొర నీటి తడులే పెట్టారు.

నీరు సమృద్ధిగా అందిన సంవత్సరాలలో తేజలాంటి హైబ్రీడ్ రకాలు ఎకరానికి 30–40 క్వింటాళ్ళ వరకు, దేశవాళీ సాదా రకం 15–20 క్వింటాళ్ళ వరకు దిగుబడులు అయ్యేవి. ఈ సంవత్సరం తేజలాంటి హైబ్రీడ్ రకం 20–25 క్వింటాళ్ళు, సాదారకం 5–15 క్వింటాళ్ళ వరకు మాత్రమే దిగుబడులు వచ్చాయి. బోర్లు వుండి, నీటి సదుపాయం ఉన్న భూములలో 20–30 క్వింటాళ్ళ వరకు దిగుబడులు వచ్చాయి. అంటే మొత్తంగా విస్తీర్ణం కొంత పెరిగినప్పటికి పంట దిగుబడి తగ్గడం వలన గత సంవత్సరం సాగు చేసిన 3.9 లక్షల ఎకరాలలో ఎంత అయిందో, ఈ సంవత్సరం సాగుచేసిన 4.6 లక్షల ఎకరాలలో అంతకన్నా ఎక్కువ పంట దిగుబడి కాలేదని వాస్తవ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వాస్తవాలు ఈవిధంగా వుండగా పాలకులు, ప్రభుత్వాలు, వ్యాపారులు – ధరల పతనానికి విస్తీర్ణం పెరగడం, దిగుబడి పెరగడం కారణంగా చెప్పడం – ప్రజలను, రైతులను అసలు కారణాల నుండి ప్రక్కదారి పట్టించడమే. "పంట ఎక్కువ అయింది కాబట్టి ధరలు తగ్గాయి. ప్రభుత్వాలు, పాలకులు మాత్రం ఏం చేస్తారు? వ్యాపారులు ఎంత పంటని కొంటారు?" అనే అశాస్త్రీయ, అవాస్తవ ఆలోచనలకు రైతులను గురిచేసి అయినకాడికి తెగనమ్ముకోవడానికి రైతులను మానసికంగా సిద్ధం చేయడం, గిట్టుబాటు ధరలు కావాలని ఆందోళనలకు రాకుండా రైతులను నిలువరించడం పాలక, ప్రభుత్వాల ప్రచారాల వెనుక వున్న లోగుట్టు.

### నిత్యావసర సరుకుగా మిర్చి :

మిర్చి (కారం) నిత్యావసర సరుకు. సుగంధద్రవ్యం. ప్రపంచంలోనూ, దేశంలోనూ మిర్చి వినియోగం ఏటేటా పెరుగుతూనే వుంది. విదేశాలకు చేసే ఎగుమతులూ, వాటి ధరలూ తగ్గడం లేదని మార్చి 24వ తేదీన జరిగిన అఖిలపక్షం సమావేశంలో ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే మిర్చి సరుకు వివరాలను ఎగుమతి వ్యాపారులు తెలియచేశారు. ఏటా మన రాష్ట్రం నుండి ఇతర దేశాలకు 50 నుండి 70 లక్షల క్వింటాళ్ళ మిర్చి ఎగుమతి అవుతుంది. 2017 జనవరి నుండి మే 5వ తేదీ వరకు షుమారుగా 40 లక్షల క్వింటాళ్ళ మిర్చి ఎగుమతి అయింది. గత రెండేళ్ళుగా ఎగుమతి ధర క్వింటా 340 నుంచి 350 డాలర్లుగా వుంది. అంటే క్వింటా మిర్చి షుమారు 25 వేల రూపాయలకు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం సమకూరుతుందనేది వాస్తవం.

ప్రపంచంలో అనేక దేశాలు మిర్చిని ఆహారపు దినుసుగా వినియోగించుకుంటున్నాయి. మిర్చినుండి రంగును తీసి నౌకా పరిశ్రమలో విస్తృతంగా వినియోగిస్తున్నారు. మన దేశంలో కారం వినియోగం విరివిగానే వుంది. మేలు రకం కారం కొనలేక సామాన్య, మధ్య తరగతి ప్రజలు నాసిరకం కారాన్నే వాడుతున్నారు. కారం ధరలు వినియోగదారులకు కంటనీళ్ళు తెప్పిస్తుండగా, మిర్చి పండించిన రైతులకు ధరలు లేక కుమిలిపోతున్నారు.

ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం క్వింటా మిర్చి 2 లేక 3 వేల రూపాయలకు మించి వ్యాపారులు కొనడంలేదు. ఆ మేరకు బయటి మార్కెట్‌లో కారం, మిర్చి ధరలు తగ్గాలి. కాని బహిరంగ మార్కెట్‌లో ఎండుమిరపకాయలు కిలో 70 లేక 80 రూపాయలకు తక్కువ దొరకడంలేదు. కారం 100 లేక 120 రూపాయలకు వ్యాపారస్తులు వినియోగదారులకు అమ్ముతున్నారు. టమాట ఊరగాయ, మిర్చి వంటి కారం పచ్చళ్ళు కిలో వందల రూపాయల ధరలు పలుకుతూ వినియోగదారులకు మంట పుట్టిస్తున్నాయి.

ఈ విధంగా ఒకవైపున రైతులను, మరోవైపున వినియోగదారులను దోచుకుంటూ మార్కెట్ దళారీశక్తులు, బడా వ్యాపారులు తెగబలుస్తున్నారని స్పష్టమౌతోంది.

**మిర్చితో పాటు రైతుల వ్యవసాయ పంటలకు ధరలు ఎందుకు పతనమయ్యాయి?**

కేంద్రంలో బి.జె.పి., రాష్ట్రంలో టి.డి.పి. ప్రభుత్వాలు అమలు జరుపుతున్న ప్రజా వ్యతిరేక 'సంస్కరణ'లు – పెద్ద నోట్ల రద్దు, నగదురహిత వ్యాపారం – లావాదేవీలు, జి.యస్.టి. చట్టం, బ్యాంకింగ్‌రంగ సంస్కరణలు వంటివి వ్యవసాయ దిగుబడుల అమ్మకం ధరలను మరింత దిగజార్చటానికి కారణాలుగా వున్నాయని ఈ మధ్య కాలంలో జరుగుతున్న పరిణామాలను పరిశీలించే వారికెవరికైనా అర్థమవుతున్న విషయమే.

సంపన్న వర్గాలు, బడాబాబులు బ్యాంకుల నుండి తీసుకున్న లక్షల కోట్ల రూపాయల రుణాలను మొండి బకాయిల క్రింద జమకట్టి బ్యాంకులు రద్దు చేశాయి. సంపన్న వర్గాలు ఎగ్గొట్టిన రుణాలతో ఒట్టిపోయిన బ్యాంకింగ్ రంగానికి మళ్ళీ జవసత్వాలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం పెద్దనోట్లను రద్దు చేసి ప్రజల కష్టార్జితాన్నంతా బ్యాంకుల్లో జమ చేయించింది. ప్రతి ఆర్థిక లావాదేవీని బ్యాంకుల ద్వారా జరపాలని ఆదేశించింది. ప్రతి వ్యక్తికి బ్యాంకు ఖాతా వుండాలని, ప్రభుత్వ సబ్సిడీలు, పథకాలన్నీ బ్యాంకుల ద్వారానే అమలు జరిగే విధంగా కార్యాచరణ రూపొందించి అమలుకు పూనుకుంది. వస్తుసేవల పన్ను విధానాన్ని చట్టం చేస్తూ సామాన్యుడిపై అధికభారాలు మోపేవిధంగా పకడ్బందీగా పన్నుల వసూలుకు పూనుకుంది. ప్రతి వ్యాపారస్తుడూ అమ్మకాల కొనుగోళ్ళ వివరాలన్నీ ఆన్‌లైన్ ద్వారా జరపాలనీ లేకుంటే వ్యాపార లైసెన్సులు రద్దు చేస్తామని హుకుం జారీ చేసి చిన్న వ్యాపారుల నడ్డివిరిచే చర్యలు చేపట్టింది.

పెద్ద నోట్ల రద్దు పర్యవసానంగా వ్యవసాయ రంగంతో పాటు సమస్త రంగాలలో రైతులు, శ్రామిక ప్రజానీకపు జీవితాలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఖరీఫ్ పంటలన్నీ చేతికొచ్చి అమ్ముకోవాల్సిన సమయమది. నగదు లేక మార్కెట్లన్నీ స్థంభించిపోయాయి. బెల్లం, ఉల్లిపాయలు, టమాటాలు, నిమ్మకాయలు కొనే నాథుడు లేక రోడ్లపై పారబోసి వెళ్ళాల్సి వచ్చింది. మార్కెట్లన్నీ మూతపడ్డాయి. వ్యాపార లావాదేవీలన్నీ ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఖరీఫ్ ధాన్యం తక్కువ ధరకు అమ్ముకోవడంతోపాటు, పంటలను అప్పుగా ఇచ్చి వేయవలసి వచ్చింది.

ఒక ప్రక్క ప్రకృతి విపత్తులు, చీడపీడలు, నకిలీలు, కల్తీలు రైతులను తీవ్రంగా కుంగదీస్తే, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పెద్దనోట్ల రద్దు చర్య రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. వ్యవసాయ పెట్టుబడులకు, కనీస అవసరాలకు కూడా చేతిలో డబ్బులు లేక రోజుల తరబడి బ్యాంకుల చుట్టూ తిరిగి క్యూలలో నిలబడలేక రైతులు నానా అగచాట్లు పడ్డారు.

ఈ వ్యవసాయ సీజన్‌లో పెద్ద నోట్ల రద్దుతో ప్రారంభమైన రైతుల కష్టాలు, పంట ధరల పతనంతో తారా స్థాయికి చేరాయి. బడా పెట్టుబడిదారులకు, అమెరికా బహుళజాతి సంస్థలకు లాభాలను, సంపదను మనదేశం నుండి తరలించడానికి ప్రధాని నరేంద్రమోడి చేపట్టిన సంస్కరణలు భారతదేశ ఆర్థిక రంగంతో పాటు సమస్త రంగాల కార్యకలాపాలను పెను సంక్షోభంలోకి పడద్రోశాయి.

ఈ సంక్షోభపు ఫలితాలు ముందుముందు అత్యంత దారుణమైన పరిస్థితులను కల్పించనున్నాయి. ఈ సంక్షోభం ఫలితంగా ఇప్పటికే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పాతాళానికి పతనమయ్యి మిర్చి రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూ వుంది. వ్యవసాయ ఉత్పత్తుల ధరల పతనం ప్రకృతి విపత్తు కన్నా భయంకరమైంది, ప్రమాదకరమైంది. మానవ కల్పిత విపత్తుకు ఎన్ని జీవితాలు బలికానున్నాయో తలచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. అయినా పాలకులకు చీమకుట్టినట్లైనా లేదు.

**ధరల పతనానికి ప్రభుత్వ విధానాలే కారణం :**

అనేక బూటకపు వాగ్దానాలతో అధికారం చేపట్టిన ప్రధాని నరేంద్ర మోడి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు జరుపుతున్న ప్రజా వ్యతిరేక సంస్కరణలు అటు రైతులతో పాటు ఇటు సాధారణ వ్యాపార వర్గాలను సైతం కుదిపి వేసింది. ఆన్‌లైన్ చెల్లింపుల వలన విపరీతమైన లాభాలను దండుకోవాలనుకున్న 'ది బెటర్ దాన్ క్యాష్ అలయన్స్, గేట్స్ ఫౌండేషన్, ది డెల్ ఫౌండేషన్, మెట్ లైఫ్ ఫౌండేషన్, మాస్టర్ కార్డ్, వీసా, ఒమిడ్‌యార్ నెట్‌వర్క్' వంటి అమెరికన్ సంస్థలు నగదు రద్దు విధానాన్ని కోరుకున్నాయి.

సామ్రాజ్యవాదులు అడుగులకు మడుగులొత్తే మనదేశ దళారీ పాలకులు, వారికి నేతృత్వం వహించే నరేంద్రమోడి – అంతర్జాతీయ బడా సంస్థలకు ఊడిగం చేయడానికే దేశంలో పెద్దనోట్ల రద్దు చర్యకు పాల్పడ్డాడు. దీనితో ప్రజా జీవితాలు అతలాకుతలం అయ్యాయి.

ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన 'సంస్కరణల'తో సాధారణ మిర్చి వ్యాపారులకు, చిన్న కమీషన్‌దారులకు కొత్త సమస్యలు వచ్చిపడ్డాయి. గతంలో వలె వ్యాపారాలు చేయడానికి వీలులేకుండా పోయింది. గతంలో గ్రామాలు తిరిగి, కళ్ళాల వద్దకు తిరిగి రైతుల వద్ద నుండి కొందరు నేరుగా మిర్చిని కొనుగోలు చేసేవారు. వాటిని అవసరమైతే అక్కడ నుండే నేరుగా తరలించేవారు. లేకుంటే నిల్వ చేసుకునేవారు. ధరలు పెరిగిన తరువాత అమ్ముకుని లాభాలు గడించేవారు. అటు మార్కెట్ సెస్, ఇటు ఇతర ఖర్చులు, పన్నులు ఏమీ లేకుండానే జీరో వ్యాపారం చేసేవారు. పంటను గోతాల్లో నింపి, లారీలకు ఎత్తి, యార్డుకు తరలించి, అమ్మకం అయ్యేదాకా కాచుకోని, డబ్బు చేతికి వచ్చేదాకా పడిగాపులు పడాల్సిన అవస్థలు తగ్గటాన్నే రైతు వెసులుబాటుగా భావించేవాడు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కేంద్ర ప్రభుత్వ నోట్ల రద్దు చర్యతో, విధించిన నిబంధనలతో కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడంలేదు.

అంతేకాకుండా గతంలో రైతులకు, కమీషన్‌దారులకు మధ్య నగదు లావాదేవీలే జరిగేవి. రైతులకు, వ్యాపారులకు మధ్యవున్న సంబంధాలు, పరిచయాలు, ఆర్థిక లావాదేవీల నిర్వహణను సులభతరం చేసేవి. పంటలకు కావలసిన పెట్టుబడిని రైతులు, వ్యాపారుల

నుండి నేరుగా నగదు రూపంలో తీసుకునేవారు. దీనికి బదులుగా పంట చేతికొచ్చిన తరువాత ఆ వ్యాపారికే సరుకును అమ్మేవారు. ఈ పద్ధతి వలన రైతుల వద్ద నుండి తమకు రావలసిన పైకాన్ని కమీషన్‌దారులు మినహాయించుకోవడానికి అవకాశం వుండేది. కాని ఇప్పుడు అలాంటి అవకాశంలేదు. ఆన్‌లైన్ చెల్లింపుల వలన కమీషన్‌దారులకు రైతులవద్ద నుండి బకాయిలు అందవు. అందుకనే మిర్చి కమీషన్‌దారులు సరుకు కొనుగోలుకు వెనకా ముందులాడుతున్నారు.

పెద్ద నోట్ల రద్దు, ఆన్‌లైన్ వ్యాపారం, ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలు వంటి సంస్కరణలు మిర్చి వ్యాపారాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. బ్యాంకుల్లో నగదు ఉపసంహరణకు పరిమితి విధించడం, మూడుసార్లు కన్నా ఎక్కువసార్లు లావాదేవీలు జరిపితే పన్ను వసూలు చేయడం వంటి నిబంధనలు వ్యాపారాల నిర్వహణను కట్టడి చేశాయి. ఆన్‌లైన్ వ్యాపారం వలన బులియన్ మార్కెట్‌లో గంటగంటకి బంగారం రేటు మారుతున్నట్లుగా మిర్చి రేటు రోజుకో విధంగా మారుతూ మరింతగా ధరల పతనం కొనసాగుతూ వుంది.

"షావుకారు వరదను కూడా వూరకపోడు" అనే సామెత మన తెలుగునాటన వున్నదే. వచ్చిన ప్రతి అవకాశాన్ని, సంక్షోభాలను సైతం తమకు అనుకూలంగా మల్చుకోవడంలో రాజకీయ నాయకుల వలే వ్యాపార వర్గాలు కూడా మహా దిట్టలు.

ప్రభుత్వాలు విధించిన ఆంక్షల మధ్య మిర్చి కమీషన్‌దారులు, వ్యాపారస్తులు తమ వ్యాపారాలను నిర్వహిస్తూ లాభాలను సంపాదించడానికి మార్గాల అన్వేషణలో పడ్డారు. అందరూ సిండికేట్ అయి కొనుగోళ్ళను మందగింప చేశారు. "పంట ఉత్పత్తి అధికమయింది. ఇతర దేశాలకు ఎగుమతులు కూడా లేవు. మిర్చికి అంతగా డిమాండ్ లేదు. ధరలు ఏమంత ఆశాజనకంగా లేవు" అనే ప్రచారాన్ని కొనుగోలు ప్రారంభం నుండే చేయడం మొదలు పెట్టారు. అయినకాడికి తెగనమ్ముకోవడానికి రైతులను మానసికంగా సిద్ధంచేస్తూ వచ్చారు. పాలకులు, ప్రభుత్వాలు సైతం ఇదే పాటని పాడడం మొదలుపెట్టారు.

ఈ సంవత్సరం జనవరి చివరి వారం నుండి మిర్చి కొనుగోళ్ళు ప్రారంభమయ్యాయి. గత సంవత్సరం తేజ వంటి హైబ్రిడ్ రకం మిర్చి క్వింటా 12–15 వేల మధ్య ప్రారంభమయి ముగింపు వరకు నిలకడగా కొనసాగింది. తాలుగాయలు సైతం 10 వేల వరకు అమ్ముడు పోయాయి. సాదా రకం మిర్చి 8–10 వేల మధ్య ప్రారంభమయి ముగింపు వరకు నిలకడగా కొనసాగింది. కాని ఈ సంవత్సరం తేజ వంటి హైబ్రీడ్ రకాలు ప్రారంభమే 6–7 వేల మధ్య ప్రారంభమయింది. ఆ ధర సైతం నిలకడగా కొనసాగక రోజురోజుకు పతనమవుతూ ప్రస్తుతం 3–4 వేల మధ్య ఊగిసలాడుతూ వుంది. ఇక సాదా రకం మిర్చి 4000–5,500 మధ్య ప్రారంభమయి రోజురోజుకు పతనమవుతూ ప్రస్తుతం 1,000–2,500 మధ్య కొట్టుమిట్టాడుతూంది. ఈ ధర సైతం నిలకడగా వుంటుందో లేదో చెప్పే పరిస్థితి లేదు.

**పోరాట పథంలో మిర్చి రైతులు :**

పతనమైన మిర్చి కొనుగోలు ధరలను పెంచి, పంటకు న్యాయమైన ధరను కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీ సంఘాలు, రైతులు, కమ్యూనిస్టు పార్టీలు గత 2 నెలలకు పైగా విస్తృత ఆందోళనలు చేస్తున్నారు. కరపత్రాలు, రాస్తారోకోలు, మండల కేంద్రాలలో ధర్నాలు, గుంటూరు మార్కెట్ యార్డులో ధర్నా, శిబిరాలు వంటి పలురకాల పోరాట పద్ధతులలో రైతులు రోడ్డుకెక్కారు. పాలక, ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై, మార్కెట్ శక్తులకు కొమ్ముకాస్తున్న పాలక, ప్రభుత్వాల వైఖరిపై పోరాట గళమెత్తారు. తీవ్రమవుతున్న మిర్చి రైతుల ఆందోళనలపై నీళ్ళు చల్లడానికి, గిట్టుబాటు ధరల సమస్యను ప్రక్కదారి పట్టించడానికి రాష్ట్ర ప్రభుత్వం చంద్రన్న చేయూత పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం ప్రకటించిన తరువాత బహిరంగ మార్కెట్‌లో మిర్చి ధరలు మరింతగా దిగజారాయి. ఈ పథకం పరిధిలోకి రావడానికి సవాలక్ష నిబంధనలు విధించి, రైతులను మరింత యిబ్బందుల్లోకి పడనెట్టారు.

రైతులందరూ గుంటూరు మిర్చియార్డులోనే అమ్ముకోవాలనే షరతు విధించడం వలన గ్రామాలలో ప్రైవేటు వ్యాపారుల కొనుగోళ్ళు నిలిచిపోయాయి. (ఆందోళనల తర్వాత తదనంతర కాలంలో రాష్ట్రంలో మరికొన్ని కేంద్రాలలో కొనుగోలుకు అంగీకరించారు.) సుదూర ప్రాంతాల నుండి మిర్చి టిక్కీలతో గుంటూరు యార్డుకు రావడం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్న భారమైన పనిగా మారింది. యార్డుకు వచ్చిన రైతులు పంట అమ్ముకోవడానికి వారం, పది రోజుల పాటు మిర్చియార్డులో పడరాని పాట్లు పడవలసి వస్తోంది.

**చంద్రన్న చేయూత పథకం–ప్రభుత్వం విధించిన నిబంధనలు :**

1. 20 క్వింటాళ్ళకు మించి కొనరు. 2. క్వింటా 8 వేల రూపాయలకు పైబడి అమ్ముకుంటే ఈ పథకం వర్తించదు. 3. కోల్డ్ స్టోరేజ్‌లలో వున్న వాటికి అవకాశం లేదు. 4. ఇప్పటికే అమ్ముకున్న వారికి అవకాశం లేదు. 5. గుంటూరు మార్కెట్ యార్డులోనే అమ్ముకోవాలి. 6. కౌలు రైతులుగా గుర్తింపుకార్డులు లేని కౌలుదారులకు అవకాశం లేదు. 7. జూన్ 30 వరకే పథకానికి గడువు.

**సాగు ధృవీకరణ మరియు పంట అమ్మకానికి కావలసిన ధృవీకరణ పత్రాలు :**

1. కౌలు గుర్తింపు కార్డు 2. వ్యవసాయ అధికారి సంతకం 3. ఉద్యానవన శాఖ అధికారి సంతకం 4. గ్రామ రెవెన్యూ అధికారి సంతకం 5. ఈ–క్రాప్ ధృవీకరణ పత్రం 6. ఆధార్ కార్డు 7. బ్యాంకు ఖాతా నంబరు 8. పట్టాదార్ పాసు పుస్తకం 9. మార్కెట్ యార్డులో ఇచ్చే ఫారం–1, ఫారం–2 పత్రాలు 10. తక్‌పట్టీ 11. కాటా రసీదు 12. విక్రయించిన మిర్చి తాలూకు బ్యాంకు ఖాతాలో జమ అయిన రశీదు 13. కళ్ళంలో కుప్పల వద్ద రైతు దిగిన ఫోటోలు– ఇన్ని ధృవీకరణ పత్రాలు సమర్పిస్తేనే చంద్రన్న చేయూతలో క్వింటాకు 1,500 రూపాయల పరిహారం అందుతుంది.

చచ్చీ చెడి ఈ నిబంధనలన్నింటిని దాటుకుని పంటను అమ్ముకుంటే, పంట డబ్బును రైతుల చేతికి యివ్వకుండా రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారట. బ్యాంకులు

ఖాతాదారులకు చుక్కలు చూపిస్తున్న సంగతి ఈ మధ్య కాలంలో అందరికీ అనుభవంలోకి వచ్చిన విషయమే. బ్యాంకుల్లో వున్న అప్పుల కింద ఈ రైతుల డబ్బును మొదటగా మినహాయించుకుంటున్నారు. అంటే చంద్రన్న చేయూత పథకం బ్యాంకులకు మరో వరమాలగా రైతులకు ఉరితాడుగా మారిందన్నమాట!

ప్రస్తుతం రైతుల వద్ద వున్న మిర్చి కేవలం 20 శాతమే. ఇప్పటికే 80 శాతం మిర్చి కోల్డ్ స్టోరేజ్‌లకు వెళ్ళడమో, రైతులు తెగనమ్ముకోవడమో జరిగింది. ఇక మిగిలిన 20 శాతం మిర్చికి మాత్రమే చంద్రన్న పరిహారం పథకం వర్తించేది. సవాలక్ష నిబంధనలు పెట్టి ఈ 20 శాతాన్ని కూడా సాధ్యమయినంత వరకు తగ్గించడానికి ప్రభుత్వం శతవిధాల ప్రయత్నం చేస్తోంది.

గుంటూరు మిర్చియార్డులో సరుకు అమ్ముకోవాలంటే నిబంధనల్ని దాటుకుని వెళ్ళినా క్వింటాకి 7 లేక 8 వందల రూపాయలు ఖర్చు అవుతాయి. అధికారుల చుట్టూ సంతకాలకు తిరిగేసరికి మరికొంత ఖర్చు అవుతాయి. ఇన్ని కష్టాలు పడి రైతు అమ్ముకోగలిగేది 20 క్వింటాళ్ళు మాత్రమే!

**పథకం ప్రకటనతో మరింతగా పతనమైన మిర్చి ధరలు :**

గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం మిర్చి ధరలు సగానికిపైగా తగ్గాయి. తగ్గిన ధరలను పెంచి, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించమని రైతులు ఆందోళనలు చేస్తే ధరలు పెంచే చర్యలు తీసుకోకుండా తర్జన భర్జనలు పడి 2 నెలల తరువాత 8 వేలు మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించింది. 8 వేలకు ప్రభుత్వ సంస్థల చేత కొనుగోలు చేయించకుండా, ప్రైవేటు వ్యాపారుల యిష్టానికి వదిలేశారు. రూ. 8 వేల లోపు వ్యాపారులు కొన్న మిర్చికే చంద్రన్న పరిహారం 1,500 రూపాయల చేయూత నిస్తామని చెప్పారు. అప్పటికే క్వింటా 6-7 వేలకు మించి తేజా రకం, రూ. 4-5 వేలకు మించి సాదా రకం మిర్చి కొనుగోలు చేయని పరిస్థితి వుంది. పథకం ప్రకటనతో తేజా రకం 4-5 వేలకు, సాదా రకం 2,500-3,500 రూపాయలకు పడిపోయింది. అంటే చంద్రన్న చేయూత పథకం ధరలను పెంచడం కంటే మరింతగా దిగజారడానికే దోహదపడింది. అంతేకాక, అమ్మకాలను కష్టతరం చేసింది.

చంద్రన్న చేయూత పథకంతో క్వింటాకి 1,500 రూపాయలు చొప్పున 20 క్వింటాళ్ళకు 30 వేల రూపాయలన్నా వస్తాయన్న ఆశతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి, తెలంగాణ వంటి పొరుగు రాష్ట్రాల నుండి మిర్చి టిక్కీలతో వాహనాలు బారులు తీరాయి. గుంటూరు మిర్చియార్డు అంగుళం కూడా ఖాళీ లేకుండా మిర్చి టిక్కీలతో కిక్కిరిసి పోయింది. మిర్చి టిక్కీల వాహనాలతో యార్డు చుట్టుప్రక్కల పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. సత్తెనపల్లి, చిలకలూరిపేట వెళ్ళే రోడ్లు ట్రాఫిక్‌తో స్థంభించిపోయాయి. ప్రతి టిక్కీ గుంటూరు మిర్చియార్డులోనే అమ్మాలనే షరతు విధించడం వల్ల లక్షల టిక్కీల మిర్చి పోటెత్తింది.

చంద్రన్న పథకం వర్తించడానికి ప్రభుత్వం విధించిన షరతులు రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. అధికారుల చుట్టూ తిరిగి తిప్పలు పడి సాగు ధృవీకరణ పత్రాలు తెచ్చుకుని యార్డుకు పోయి అమ్ముకుందామనుకున్న రైతులకు పట్టపగలు చుక్కలు

కనిపించాయి. 40-45 డిగ్రీల వేసవి ఎండకు మిర్చి యార్డులో జనం తొక్కిడితో రేగుతున్న కారంతో నిండిన దుమ్ము, ధూళిలో చెమటలు కక్కుతూ తుమ్ములు, దగ్గులతో సతమతమవుతూ సరుకు అమ్ముకోవడానికి నరకం అనుభవిస్తున్నారు.

ఇన్ని కష్టాలు అనుభవించినా రైతులకు కలిగిన ప్రయోజనం శూన్యం. పథకం ప్రకటనతో ధరలు మరింతగా వీగిపోవడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. చంద్రన్న పథకం రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. ధరల పతనానికి కారణమయింది.

రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా మిర్చిని కొనకుండా కేవలం పరిహారం మాత్రమే చెల్లించాలని నిర్ణయించడం, మద్దతు ధర విధానాన్ని రద్దు చేయడం, ప్రభుత్వానికి అవసరమయితేనే ఇకముందు పంటలను కొనుగోలు చేయాలని, ప్రభుత్వం రైతులకు చెల్లించే పరిహారం పది శాతానికి మించకూడదని, రైతులు తాము పండించే పంటను ముందుగా ప్రభుత్వం వద్ద నమోదు చేసుకోవాలని, పంటను మొత్తం మార్కెట్‌లోనే అమ్మాలని ఏప్రియల్ 27వ తేదీన విడుదల చేసిన నీతి ఆయోగ్ మూడు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికలో పేర్కొంది.

నీతి ఆయోగ్ సూచనల మేరకే రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకుండా పరిహారాన్ని ప్రకటించి చేతులు దులుపుకుంది.

పంటల ధరలను వ్యాపారులు తగ్గించినపుడు ప్రభుత్వరంగ సంస్థలు వెంటనే రంగంలోకి దిగి కనీస మద్దతు ధరను నిర్ణయించి ఆ మేరకు రైతుల నుండి నేరుగా కొనుగోలు చేస్తే మార్కెట్‌లో పోటీ పెరిగి పంటలకు ధరలు లభించే పరిస్థితి వుంటుంది. కాని ప్రభుత్వం ఆ విధమైన చర్యలు తీసుకోలేదు.

ధరలు పతనమై, నష్టాల పాలవుతున్న రైతులను ఆదుకునేందుకు నాటకీయంగా, రాజకీయ ప్రయోజనాల కొరకు ఆలస్యంగా కదిలిన ప్రభుత్వాలు మార్కెట్‌లో నేరుగా జోక్యం చేసుకోవడానికి సిద్ధపడడంలేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న వ్యాపారస్తులు అంతకంతకు రేట్లు తగ్గిస్తున్నారు.

ప్రభుత్వాలు నేరుగా పంటను కొనుగోలు చేయకుండా వ్యాపారుల చేతుల్లో రైతుల జుట్టు పెట్టడం వల్ల ప్రభుత్వం ప్రకటించిన 8 వేల రూపాయల మద్దతు ధర అమల్లోకి వచ్చిన రెండు వారాల్లో మిర్చి ధరలు పాతాళానికి పడిపోయాయి. దీనితో చంద్రన్న చేయూత పథకం ఘోరంగా విఫలమయింది. పథకం ద్వారా కొనుగోళ్ళు మొదలుపెట్టిన రెండు వారాలకు కేవలం పదకొండు మంది రైతులకు మాత్రమే ఈ పథకం అమలవటమే ఈ పథకం బూటకత్వాన్ని వెల్లడి చేస్తోంది.

**పుండు మీద కారం చల్లిన కేంద్ర ప్రభుత్వ పథకం :**

రాష్ట్ర ప్రభుత్వం 8 వేల రూపాయలు మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయకుండా 1,500 రూపాయల పరిహార పథకం ప్రకటించడంతోటి అప్పటివరకు వున్న నామమాత్రపు ధరలు సైతం అమాంతం పడిపోయి రైతులు లబోదిబో మంటుండగా, కేంద్ర ప్రభుత్వం మరో పథకాన్ని 5 వేల రూపాయల మద్దతు ధరని ప్రకటించి అసలే పతనమైన ధరలను అధః పాతాళానికి పడనెట్టింది.

కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి సవాలక్ష కొర్రీలు తగిలించింది. క్వింటా 5 వేలకు కొంటామని చెపుతూనే ఈ సొమ్మును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరించాలని మెలిక పెట్టింది. వీటిని తిరిగి అమ్మే సమయంలో నష్టం వస్తే 25 శాతం మించి కేంద్రం భరించదని స్పష్టం చేసింది. ఈ పథకానికి గడువును మే 2 నుండి మే 31 వరకు నిర్ణయించింది. ఈ గడువులోపల కేవలం 88,300 మెట్రిక్ టన్నుల మిర్చిని మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పింది. అంతేకాకుండా నాణ్యమైన గ్రేడ్-1 రకం కాయలను మాత్రమే కొనుగోలు చేస్తామంది. దీనికే మార్కెటింగ్ ఇంటర్‌వెన్షన్ స్కీం అని పేరు పెట్టింది. కేంద్ర ప్రభుత్వ పథకం యొక్క ప్రకటనతో రైతులలో గందరగోళం, అయోమయం ఏర్పడ్డాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన రెండు వేర్వేరు పథకాలు వ్యాపారుల దోపిడిని నియంత్రించే విధంగా లేవు. ఇష్టానుసారం ధరలను దిగ్గోస్తున్న వ్యాపారులను, దళారీలను నిరోధించేవిధంగా ప్రభుత్వ చర్యలుండాల్సింది పోయి, వారి బరితెగింపుకు లైసెన్స్ యిచ్చే విధంగా వున్నాయి. ప్రభుత్వాలు ప్రకటించిన పథకాలు రైతులను మోసగించడానికి తప్ప ఉద్ధరించడానికి కాదని జరుగుతున్న పరిణామాలు పాలకులు, అధికారులు ఆడుతున్న నాటకాలు స్పష్ట పరుస్తున్నాయి. ప్రభుత్వాల వాలకం చూస్తుంటే రైతులను వ్యాపార తిమింగలాలకు ఆహారంగా వేస్తున్నట్లు కనిపిస్తుంది.

**కోల్డ్ స్టోరేజ్ యజమానుల దోపిడి :**

రైతుల వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి ప్రభుత్వం శీతల గిడ్డంగులను నిర్మాణం చేయవలసిన బాధ్యత నుండి తప్పుకుని ప్రైవేటు వ్యక్తులకు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని రుణాలుగా, రాయితీలుగా ఇస్తోంది. కోటిన్నర నుండి రెండు కోట్ల రూపాయల వరకు ప్రభుత్వ రాయితీని పొందిన కోల్డ్‌స్టోరేజీల యాజమాన్యం రైతులను నిలువునా దోపిడికి గురిచేస్తోంది.

జిల్లాలో షుమారు 113 వరకు మిర్చి కోల్డ్ స్టోరేజ్‌లు వున్నాయి. ప్రకాశం జిల్లాలో 65 వరకు వున్నాయి. ఒక్కో కోల్డ్‌స్టోరేజ్‌లో లక్ష వరకు మిర్చి టిక్కీలు పట్టే అవకాశం వుంది. ఒక్కో మిర్చి టిక్కీకి గత సంవత్సరం 160 రూపాయల నుండి 180 రూపాయల వరకు అద్దె ఉండేది. కాని ఈ సంవత్సరం 250 నుండి 300 రూపాయల వరకు ఒక్కసారిగా పెంచివేశారు. నిల్వ చేసిన మిర్చి టిక్కీల ప్రాతిపదికన యాజమాన్యం రైతులకు రుణం రూపంలో కొంత నగదు ఇచ్చేవారు. కాని ఈ సంవత్సరం మిర్చి టిక్కీలు నిల్వ చేసుకోవడానికి రైతుల వద్ద నుండి ముందుగానే అద్దె డబ్బులు వసూలు చేస్తున్నారు.

బడా వ్యాపారస్తులు ముందుగానే స్టోరేజ్‌లను బుకింగ్ చేసుకోవడం వలన రైతులకు మిర్చిని నిల్వ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. రైతుల ఇండ్ల చుట్టూ, కళ్ళాల చుట్టూ తిరిగి 'మా కోల్డ్‌స్టోరేజ్‌కి రండి ఎన్నో ప్రయోజనాలను కల్పిస్తాం, రుణాలిస్తాం, రాయితీలిస్తాం, పంటకు గ్యారెంటీ ఇస్తామ'ని రైతులను బ్రతిమలాడుకునే యజమానులు, రైతులే యజమానుల చుట్టూ తిరుగుతున్నా ఈ సంవత్సరం కనికరించడంలేదు. నిల్వ చేసుకోవడానికి అవకాశం యివ్వడం లేదు.

ఈ విధంగా ఆరుగాలం కష్టించి, ప్రకృతి విపత్తులకు ఎదురొడ్డి, ఎన్నో అవస్థల నెదుర్కొని రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర, న్యాయమైన ధర కల్పించకపోగా కనీస మద్దతుధరతో కూడా కొనుగోలు చేయించకుండా పాలకులు రైతాంగ జీవితాలతో చెలగాటమాడుతున్నారు. చంద్రన్న చేయూత పథకంగానీ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పరిహార పథకాలుగానీ – సారాంశంలో రైతులకు ఒరగబెట్టిందేమీలేదని స్పష్టమౌతోంది. పాలకుల విధానాలలోని మోసకారీతనాన్ని అర్థం చేసుకొని, తాము పండించిన పంటలకు న్యాయమైన ధరలు కల్పించేవరకు పోరాటం చేయటమే రైతాంగం ముందున్న ఏకైక మార్గం. అందుకు ఐక్యంగా సిద్ధమవుదాం.


**చేయూత పథకాల పేరుతో మిర్చి రైతులను మరింతగా దగాచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**

ప్రచురణ కాలం : మే 2017

ప్రచురణ : రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

వెల : రూ. 5/-

మొదటి కవరుపేజి : **మిరపకోతలో కూలీలు, మిరప కళ్ళాలు**

వెనుక కవరుపేజి : **గుంటూరు మిర్చి యార్డు, ఆందోళనలో రైతులు**

ప్రతులకు :

**మైత్రి బుక్ హౌస్**
జలీల్ వీధి
కారల్‌మార్క్స్ రోడ్
విజయవాడ-2




వివరాలకు :

**యస్. ఝాన్సీ**, అధ్యక్షులు
రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)
డోర్ నెం. 35-10-10, తరిమెల నాగిరెడ్డి భవన్,
న్యూ గిరిపురం, విజయవాడ-10.
E-mail : jhansircsap@gmail.com

# కొరివికారం

- బండ్ల మాధవరావు

గుంటూరు సీమ్మిరబగాయ దిన్నావా
కొరికిజూడు నసాళానికంటుద్ది
రోషానికి పౌరుషానికి ప్రతీక
ఎర్రగా నిగనిగలాడుతూ
కళ్ళకింపుగా
అసలా చేను పక్కగా నడుస్తుంటేనే
అదోరకమైన కమ్మనివాసన
నిలువెత్తు బెరిగి యిరగ బూసిన
దిష్టి బంతి చెట్ల నడుమ
నడుం లెత్తు బెరిగిన మిరపచెట్లు
యిరగ్గాసి వాలిపోయిన కొమ్మల్లోంచి
తెల్లతెల్లగా పచ్చపచ్చగా ఎర్రెర్రగా
కాయల్ని జూత్తేనే కడుపునిండిపోద్ది
అసలా కారం లేకుండా
యెవురింట్లోనైనా ఓ పూట గడిచిద్దా
కొరివికారం, గొడ్డుకారం, సాంబారుగారం,
పచ్చికారం
అబ్బో యిట్టా చెబుతా బోతంటేనే
నోటమ్మట నీరు గారతన్నాయిలే
కానీ ఏం లాభం
ఆకులో జూసుకొని పిర్రలు
గొట్టుకుంటూ
సంబరబట్టమే అయింది
యీళ్ల కళ్ళలో కారం గొట్ట
మా నోళ్ళలో మట్టిగొట్టి బోతన్నారు
యీళ్లకి దివసంబెట్ట
కొనబోతే కొరివి అమ్మబోతే అడివి
అయిపాయె
యింతింత రేట్లు బెట్టి
యెరువులు పురుగుమందులు బోసి
పెంచాం గదా
మా కట్టవంతా యీళ్ల యెదాన
బోత్తన్నాం
యీళ్ళ కొంపల్లో మిరబగాయలు
బోసి తగలెయ్య
మా బతుకులు తాలుగాయల
బతుకులైపోయాయి
యింతింత జదుకొని యీళ్లు
నేర్చుకొంది
మమ్మల్నెట్టా మోసం
జెయ్యాలనేగందా
మా వుసురు దగలకపోదు
యీళ్ల కొంపల్లో పల్లేరు మొక్కలు
మొలవ ❖






ఎవరూ మంట పెట్టలేదు సార్.
రైతుల కడుపు మండి దాన్తో అంటుకున్నాయి.

